ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 32.0 కనిష్ఠం : 19.0
ANDHRAJYOTHY
5

నారాయణపేట
జిల్లా వార్తలు
బుధవారం 1 అక్టోబరు 2025

కోడ్ కూసింది

- స్థానిక సంస్థల ఎన్నికలకు మోగిన నగారా
- పార్టీ జెండాల తొలగింపు
- గోడలపై గుర్తులు, రాతలు చెరిపివేత
- అభివృద్ధి పనులకు బ్రేక్


నారాయణపేట మండలం సింగారంలో ఓ పార్టీ జెండా కనిపించకుండా కప్పుతున్న మునిసిపల్ సిబ్బంది

నారాయణపేట, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి రాష్ట్ర ఎన్నికల కమిషన్ షెడ్యూల్ ప్రకటించడంతో కోడ్ అమల్లోకి వచ్చింది. దాంతో నారాయణపేట జిల్లా వ్యాప్తంగా అధికార యంత్రాంగం పార్టీ జెండాలు కనిపించకుండా వాటికి ముసుగు వేస్తున్నారు. గోడలపై పార్టీల గుర్తులు, రాతలు కనిపించకుండా సున్నాలు వేస్తున్నారు. ఫ్లెక్సీలు తొలగిస్తున్నారు. ఎన్నికల నియమావళి వల్ల అభివృద్ధి కార్యక్రమాలకు బ్రేక్ పడింది. ఎమ్మెల్యేలు అధికారులతో సమీక్ష సమావేశాలకు దూరంగా ఉండనున్నారు. రూ.50 వేలకు పైబడి నగదును ఎవరైనా వెంట తీసుకెళ్తే పోలీసులకు ఆధారాలు చూపించాల్సి ఉంటుంది. అనుమతి లేకుండా ఎన్నికల ప్రచారాలకు మైకులను వినియోగిస్తే సీజ్ చేయనున్నారు. నాయకులు రెచ్చగొట్టేలా ప్రసంగాలు చేయొద్దు. ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలు, పంచాయతీ కార్యాలయాలు, దేవాలయాల్లో రాజకీయ సమావేశాలు నిర్వహించ కూడదు.


ఓ పార్టీ జెండా గుర్తు కనిపించకుండా సున్నం వేస్తున్న మునిసిపల్ కార్మికుడు


ఫ్లెక్సీలను తొలగిస్తున్న కార్మికులు

ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలి

- ఏ చిన్న పొరపాటూ జరుగొద్దు
- విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు
- కలెక్టర్ సిక్తా పట్నాయక్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

నారాయణపేట, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎన్నికల సంఘం నిబంధనలు పాటిస్తూ లోకల్ బాడీ ఎన్నికలను పకడ్బందీగా, ప్రశాంతంగా నిర్వహించాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను, ట్రైనీ కలెక్టర్ ప్రణయ్ కుమార్‌తో కలిసి నోడల్ అధికారులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల ఏర్పాట్లపై నోడల్ అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఏ చిన్న పొరపాటు కూడా జరుగొద్దన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వస్తే కఠిన చర్యలకు గురికావాల్సి వస్తుందని హెచ్చరించారు. ఓటర్లను ప్రలోభాలకు గురి చేసేలా నగదు, మద్యం పంపిణీ చేస్తే ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. వస్తువులను సీజ్ చేసిన సందర్భాలలో అన్ని బృందాలు సమన్వయం చేసుకోవాలని సూచించారు. జిల్లాలోని చెక్‌పోస్టులలో వాహనాల తనిఖీలు నిష్పక్షపాతంగా, పకడ్బందీగా చేపట్టాలన్నారు. నోడల్ అధికారులు రిపోర్టులు రోజూ నిర్ణీత ఫార్మాట్‌లో పంపాలన్నారు. ఎన్నికల నిర్వహణలో అధికారుల పాత్ర కీలకమని పేర్కొన్నారు. నోటిఫికేషన్ విడుదలైన తరువాత నామినేషన్ పత్రాల స్వీకరణ నుంచి ఎన్నికల నిర్వహణ పూర్తయ్యే వరకు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎన్నికల హ్యాండ్ బుక్‌లోని ప్రతీ అంశంపై అవగాహన తెచ్చుకోవాలన్నారు. జిల్లాలో మ్యాన్‌పవర్ మేనేజ్‌మెంట్, శిక్షణ కార్యక్రమాల నిర్వహణ, మెటీరియల్ మేనేజ్‌మెంట్, ఎక్స్‌పెండీచర్ మానిటరింగ్, మీడియా కమ్యూనికేషన్, హెల్ప్‌లైన్, కంప్లైంట్స్ రెడ్రెస్సల్, వెబ్‌కాస్టింగ్ తదితర విభాగాల వారీగా ఎలాంటి అంతరాయం లేకుండా నోడల్ అధికారులను నియమించామన్నారు. నోడల్ అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలులో ఉన్నందున నిబంధనలను గుర్తు చేశారు. జిల్లా ప్రజలంతా ఎన్నికల నియమావళిని పాటించి శాంతియుత వాతావరణంలో ఓటు హక్కును వినియోగించుకోవాలని అన్నారు. సమావేశంలో ఎస్‌డీసీ రాజేందర్ గౌడ్, డీఎస్పీ నల్లపు లింగయ్య, జడ్పీ సీఈవో మొగులప్ప, సీపీవో యోగానంద్, నోడల్ అధికారులు ఎంఏ రషీద్, రెహమాన్, వెంకటేశ్, సైదులు పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర రహదారిపై ప్రమాదకర గుంత

మరికల్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మరికల్ మండల కేంద్రంలోని శివారులో 167 అంతర్రాష్ట్ర రహదారిపై మంగళవారం భారీ గుంత ఏర్పడింది. ఇటీవల కురిసిన వర్షాలకు భారీ వాహనాలు వెళ్లడం వల్ల ఏర్పడిన ఈ గుంత ప్రమాదకరంగా మారింది. రాత్రి వేళ ఆ గుంత కనిపించక వాహనాలు ఎగసి పడుతున్నాయి. ద్విచక్ర వాహనదారులు మరింత ఇబ్బంది పడుతున్నారు. విషయాన్ని గ్రామస్థులు ఎస్‌ఐ రాములుకు తెలిపారు. దాంతో ఎస్‌ఐ వెంటనే అక్కడ బారికేడ్లు ఏర్పాటు చేసి, సంబంధిత అధికారులకు సమాచారం ఇచ్చారు. అధికారులు ఎక్స్‌కవేటర్‌ను తెప్పించి, మరమ్మతులు చేయించారు.


రహదారిపై గుంత ఏర్పడిన ప్రాంతంలో ఉంచిన బారికేడ్లు

నష్టపోయిన రైతులను ఆదుకుంటాం

- క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి
- కృష్ణ మండలంలో నీట మునిగిన పంటల పరిశీలన

7

గిరిజన భవన్‌కు.. రూ.3 కోట్ల నిధులు


మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): పాలమూరులో గిరిజన భవన్ అభివృద్ధి కోసం ప్రభుత్వం రూ.3 కోట్ల నిధులు మంజూరు చేస్తూ, జీఓ విడుదల చేసిందని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలో ఎన్నో పోరాటాల ఫలితంగా 500 గజాల స్థలాన్ని గిరిజన భవన్‌కు కేటాయించారని, అప్పటి నుంచి అక్కడ ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టలేదన్నారు. తాను ఎమ్మెల్యేగా ఎన్నికైన తరువాత గిరిజన భవన్ కోసం ప్రయత్నాలు చేయడం జరిగిందని చెప్పారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గిరిజన భవన్ అభివృద్ధికి నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, సంబంధిత శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. గిరిజన బిడ్డలకు రిజర్వేషన్లు వచ్చిన రోజునే జీఓ రావడం సంతోషంగా ఉందని తెలిపారు. మూడు అంతస్థులలో భవనాన్ని నిర్మించనున్నామన్నారు. మొదటి అంతస్థులో అద్భుతమైన లైబ్రరీ, రెండు ఫ్లోర్‌లు మీటింగ్‌లు నిర్వహించుకునే ఓపెన్ హాల్స్ ఉంటాయన్నారు. తన హయాంలో మంచి గిరిజన భవన్ నిర్మిస్తే తనకు అంతకన్నా కావలసిందేమీ లేదన్నారు. ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతీ గిరిజన బిడ్డకు అందిస్తున్నామన్నారు.

గ్రామాల్లోనే ప్రణాళికలు

స్థానిక సంస్థల ఎన్నికలకు గ్రామాల్లోనే ప్రణాళికలను సిద్ధం చేసుకుంటామని ఎమ్మెల్యే అన్నారు. అభ్యర్థి ఎవరో వాళ్ళే ఏకాభిప్రాయంతో ముందుకు వస్తే వారికే టికెట్లు ఇస్తామని, ఇందులో మా జోక్యం ఏమీ ఉండదని అన్నారు. బాకీ కార్డు పెట్టాల్సింది కాంగ్రెస్‌కు కాదని, బీఆర్ఎస్‌కేనని అన్నారు. అదే పెడితే ఆ కుటుంబమే కుర్చీకి అనర్హులని అన్నారు.


మాట్లాడుతున్న ప్రభాకర్

పత్తి దిగుమతిపై సుంకాన్ని పునరుద్ధరించాలి

- ఏఐయూకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వి.ప్రభాకర్, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి టి.సాగర్

నారాయణపేట న్యూటౌన్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): పత్తిపై ఎత్తేసిన 11% సుంకాన్ని పునరుద్ధరించాలని ఏఐయూకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వి.ప్రభాకర్, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి టి.సాగర్ పిలుపునిచ్చారు. వ్యవసాయ సంక్షోభానికి కారణమవుతున్న కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాడుదామని పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని మెట్రో ఫంక్షన్ హాల్‌లో మంగళవారం సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో జిల్లా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా టి.సాగర్, వి.ప్రభాకర్ మాట్లాడుతూ రైతుల వైపే ఉంటానని చెబుతున్న ప్రధాని పత్తిపై 11% సుంకాన్ని ఎత్తేశారన్నారు. కార్యక్రమంలో అఖిల భారత ఐక్య రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు భగవంతు, తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు అంజిలయ్య, ఏఐయూకేఎస్, మాస్‌లైన్ పార్టీ, సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా దుర్గాష్టమి వేడుకలు

- జోరందుకున్న పూలు, పూజా సామగ్రి కొనుగోలు
- తెల్లవారుజామున పొట్టేళ్ల సమర్పణతో మొక్కుల చెల్లింపు

నారాయణపేట, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): దుర్గాష్టమి వేడుకలను జిల్లా ప్రజలు మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలో బంతి, చామంతి పూలు, గుమ్మడికాయలు, నిమ్మకాయలు, తమలపాకులు తదితర పూజ సామాగ్రి కొనుగోళ్లు జోరందుకున్నాయి. కర్ణాటకలోని అమీన్‌ఘడ్ నుంచి దిగుమతి చేసుకున్న పొట్టేళ్లను యువత అంబాభవానీ ఆలయం వద్ద ప్రదర్శన చేశారు. దుర్గామాతకు అర్ధరాత్రి పూజలు చేసి, బుధవారం తెల్లవారుజామున పొట్టేళ్లను బలిచ్చి మొక్కులు తీర్చుకున్నారు.


జిల్లా కేంద్రంలో బంతి పూలను కొనుగోలు చేస్తున్న పట్టణవాసులు


నారాయణపేటలోని అంబాభవానీ ఆలయం వద్ద పొట్టేళ్లతో పట్టణ వాసులు

ప్రైవేటు ఆసుపత్రుల్లో పదో తరగతి ఫార్మసిస్టులు!

- అసలు ఫార్మసిస్టులు లైసెన్సులకే పరిమితం
- ప్రజల ప్రాణాలతో యజమానుల చెలగాటం
- పట్టించుకోని ఔషధ నియంత్రణ శాఖ అధికారులు

7


కోస్గి పట్టణంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు


నర్వలో దుర్గామాత అలంకరణలో బతుకమ్మ



మద్దూర్‌లో బతుకమ్మలకు పూజ చేస్తున్న మునిసిపల్ కమిషనర్ శ్రీకాంత్, బతుకమ్మ ఆడుతున్న మహిళలు

చిత్తూ చిత్తుల బొమ్మ

- ఘనంగా కొనసాగుతున్న బతుకమ్మ సంబురాలు

కోస్గి/నర్వ/మద్దూర్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో బతుకమ్మ సంబురాలు ఘనంగా కొనసాగుతున్నాయి. మంగళవారం కోస్గి, గుండమాల్, నర్వ, మద్దూర్‌లలో వేడుకలను నిర్వహించారు.

- కోస్గి పట్టణంలో మునిసిపల్ శాఖ ఆధ్వర్యంలో వేడుకలు చేపట్టారు. పాతరగడ్డ అంజనేయస్వామి ఆలయ ఆవరణలో మహిళా సంఘాల సభ్యులు, ఆయా వార్డుల మహిళలు, మునిసిపల్ మహిళా సిబ్బంది బతుకమ్మ ఆడారు. కమిషనర్ నాగరాజు, మేనేజర్ అనిల్, మహిళా సంఘాల మహిళలు తదితరులున్నారు.
- గుండుమాల్ మండల కేంద్రంలో బతుకమ్మ వేడుకలను జరుపుకున్నారు.

నర్వలో పోటీలు

నర్వ మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి బుచ్చారెడ్డి ఆధ్వర్యంలో సద్దుల బతుకమ్మ సంబురాలు ఘనంగా జరుగుతున్నాయి. మహిళలు రంగురంగుల పూలతో పేర్చిన బతుకమ్మను ఒక చోటకు చేర్చి ఆడిపాడారు. బతుకమ్మ పోటీల్లో మొదటి బహుమతి గజలమ్మ కాలనీకి రూ.10 వేలు, రెండో విజేత వాల్మీకి కాలనీకి రూ.5 వేలు, మూడో బహుమతిని కర్రెమ్మ కాలనీకి రూ.3 వేలు అందించారు.

మద్దూరులో..

మద్దూర్ మునిసిపాలిటీ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. మహిళలు, చిన్నారులు పాటలు పాడుతూ ఆటలు ఆడారు. మునిసిపల్ కమిషనర్ శ్రీకాంత్, మార్కెట్ కమిటీ చైర్మన్ భీములు, గుత్తిపురుషోత్తం, నాయకులు, మహిళలు పాల్గొన్నారు.



అలంపూర్‌లో సిద్ధిధాత్రీదేవి అలంకరణలో జోగులాంబదేవి అమ్మవారు



మాణిక్యగిరి క్షేత్రంలో సిద్ధిధాత్రిగా భవానీ మాత దర్శనం



జోగులాంబ గద్వాల జిల్లా, జములమ్మ ఆలయంలో దుర్గాదేవి అలంకారంలో అమ్మవారు



జడ్చర్లలోని శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరీ దేవాలయంలో మహిషాసుర మర్దిని అవతారంలో దర్శనమిస్తున్న అమ్మవారు



కల్వకుర్తి వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో దుర్గాదేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు



బ్రాహ్మణవాడిలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో మహిషాసుర మర్దినిగా అమ్మవారి అలంకరణ

దుర్గాదేవీ పూజయామి

శరన్నవరాత్రి వేడుకలు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వైభవంగా కొనసాగుతున్నాయి. మంగళవారం దుర్గాష్టమి సందర్భంగా అమ్మవారు దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే కొన్ని ఆలయాల్లో అమ్మవారిని మహిషాసుర మర్దినిగా అలంకరించారు. అలంపూర్ జోగులాంబ అమ్మవారు సిద్ధిదాత్రిగా భక్తులకు దర్శనమిచ్చారు. - నెట్‌వర్క్, ఆంధ్రజ్యోతి

అథ్లెటిక్స్‌లో గిరిజన విద్యార్థిని ప్రతిభ

- పరుగుపందెంలో స్వర్ణ పతకం
- మరెన్నో విజయాలు సాధించాలి
- ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి



అథ్లెటిక్స్‌లో ప్రతిభ కనబర్చిన గిరిజన విద్యార్థినిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి

తిమ్మాజిపేట, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : అథ్లెటిక్స్ పోటీల్లో గిరిజన విద్యార్థిని ప్రతిభ కనబరిచి ప్రశంసలందుకున్నది. నాగర్‌కర్నూల్ జిల్లా, తిమ్మాజిపేట మండల పరిధిలోని కొడావత్ తండాకు చెందిన గిరిజన విద్యార్థిని స్వప్న ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరులో ఈ నెల 24, 25 తేదీల్లో నిర్వహించిన సౌత్‌జోన్ జూనియర్ జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొన్నది. పరుగుపందెంలో బంగారు పతకాన్ని సాధించింది. విషయం తెలుసుకున్న నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేశ్‌రెడ్డి మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో విద్యార్థినిని ఘనంగా సన్మానించారు. అనంతరం మాట్లాడుతూ స్వప్న మరెన్నో విజయాలను సాధించాలని ఆకాంక్షించారు. క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరికి ఫోన్ చేసి, స్వప్న సాధించిన విజయాలను తెలియజేశారు. ప్రభుత్వం తరఫున అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని స్వప్నకు భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వెంకటరామిరెడ్డి, రాష్ట్ర టెలికాం శాఖ డైరెక్టర్ శ్రీనివాస్ బహుదూర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లయ్యగౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మాధవులు, నాయకులు లక్ష్మీనారాయణ, గోవిందనాయక్, రాఘవేంద్ర, శంకర్‌నాయక్ పాల్గొన్నారు.

అటవీ సెక్షన్ అధికారికి బంగారు పతకం



భాగ్యమ్మకు గోల్డ్ మెడల్ పురస్కారాన్ని అందజేస్తున్న సువర్ణ, ఏలూసింగ్ మేరు

మన్ననూర్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, అమ్రాబాద్ మండలంలోని మాచారం అటవీ సెక్షన్ అధికారి ఎం భాగ్యమ్మ కేవీఎస్ బాబు మెమోరియల్ గోల్డ్‌మెడల్ - 2025 పురస్కారానికి ఎంపికయ్యారు. అటవీశాఖ దూలపల్లి రాష్ట్ర అకాడమీ చీఫ్ కన్సర్వేటర్ ఆర్ సువర్ణ, ప్రిన్సిపల్ చీఫ్ కన్సర్వేటర్ ఆఫ్ ఫారెస్టు (పీసీసీఎఫ్) ఎలూసింగ్ మెరు చేతుల మీదుగా మంగళవారం ఆమె స్వర్ణపతకాన్ని అందుకున్నారు. భాగ్యమ్మ 16 ఏళ్లుగా బీట్ ఆఫీసర్ నుంచి సెక్షన్ అధికారిగా సేవలందిస్తున్నారు. అడవులు, వన్య ప్రాణుల సంరక్షణ చర్యలను జాగ్రత్తగా నిర్వహిస్తున్నారు., జంగంరెడ్డి పల్లి, మాచారం, రంగాపూర్ గ్రామాల పరిధిలో 105 హెక్టార్ల ఆక్రమిత భూమిని స్వాధీనం చేసుకొని, మొక్కల పెంపకం చేపట్టారు. ఆమె సేవలకు గుర్తింపుగా ప్రభుత్వం ఆమెకు బంగారు పతకాన్ని అందించింది.

వర్షానికి కూలిన మట్టి మిద్దె



కూలిన ఇంటి వద్ద ఒంటరి మహిళ పార్వతమ్మ

గద్వాల టౌన్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని వేదనగర్‌లో ఓ మట్టి మిద్దె అకస్మాత్తుగా కూలిపోగా, ఇంట్లో నివసిస్తున్న మహిళ పార్వతమ్మ అదృష్టవశాత్తు ప్రాణాపాయం నుంచి బయటపడింది. ఆమె భర్త కొన్నేళ్ల క్రితం మృతి చెందడంతో ఆమె ఒంటరిగా నివసిస్తోంది. సోమవారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు జోరుగా కురిసిన వర్షానికి ఆమె నివసిస్తున్న మట్టిమిద్దె తడిసిపోయి, మంగళవారం ఉదయం కూలిపోయింది. అంతకు ముందే పార్వతమ్మ ఏదో పని మీద బయటకు వెళ్లడంతో ప్రాణాలతో బయటపడింది.

కూలిన మట్టిమిద్దె



గుడిగండ్లలో కూలిన మట్టి మిద్దె

మక్తల్ రూరల్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా, మక్తల్ మండలంలోని గుడిగండ్ల గ్రామంలో ఓ మట్టి మిద్దె కూలిపోయింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన పత్తిఫురం చంద్రప్పకు చెందిన మట్టిమిద్దె మంగళవారం కూలిపోయింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. కాగా ఇంట్లోని బియ్యం, ఇతర వంట సామగ్రి మట్టిలో కూరుకుపోయిందని బాధితుడు తెలిపారు.

వృద్ధాప్యంలో ఒంటరితనం

- కన్న బిడ్డల అభివృద్ధి కోసం జీవితం అంకితం
- వారి ఉన్నత చదువుల కోసం తపనే నిరంతరం
- ఉపాధి బాటలో దూర ప్రాంతాలకు సంతానం
- పట్టించుకొనే వారు లేక మానసిక వేదన
- నేడు ప్రపంచ వృద్ధుల దినోత్సవం



నారాయణపేట వృద్ధాశ్రమంలో ఉన్న వృద్ధులు

నారాయణపేట టౌన్ సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : తమ పిల్లలు శ్రద్ధగా చదువుకోవాలని, వారు ఉన్నత శిఖరాలకు ఎదగాలని జీవితాలను అంకితం చేస్తున్న తల్లిదండ్రులు వృద్ధాప్యంలో ఒంటరిగా మిగిలిపోతున్నారు. ఉపాధి, ఉద్యోగాల కోసం కుమారులు, కుమార్తెలు నగరాలకు వెళ్లిపోతున్నారు. ఎప్పుడో పండుగలు, శుభకార్యాలకు మాత్రమే వారు ఇళ్లకు వచ్చి వెళ్తుంటారు. మరికొందరు విదేశాలకు వెళ్లి అక్కడే స్థిరపడుతున్నారు. వారి ఏడాదికోసారి ఊరికి రావడం గగనంగా మారుతోంది. అన్ని బాధ్యతలు ముగిసి, పిల్లలు జీవితాల్లో స్థిరపడే సమయానికి వృద్ధాప్యానికి చేరుకుంటున్న తల్లిదండ్రులు ఇళ్లలో ఒంటరిగా మిగిలిపోతున్నారు. పట్టించుకునే వారు లేక, పలుకురించే దిక్కులేక మానసిక క్షోభకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో కొందరు కుమారులు తల్లిదండ్రులను వృద్ధాశ్రమాల్లో చేరుస్తున్నారు. మరికొందరు ఒంటరిగా జీవించలేక స్వయంగా వృద్ధాశ్రమాలకు వెళ్లిపోతున్నారు.

ఆదుకుంటున్న వృద్ధాశ్రమం

ఆర్థిక స్థోమత లేని పేద వారి పరిస్థితి వృద్ధాప్యంలో మరింత దయనీయంగా మారుతోంది. కన్న పిల్లలు జీవితాల్లో స్థిరపడక, వారి కష్టాల్లో వారు ఉండిపోతే వీరిని పట్టించుకొనే వారే కరువవుతారు. అలాంటి వారిని ఆదుకునేందుకు తెలంగాణ ప్రభుత్వం 2023లో ప్రత్యేకంగా వృద్ధాశ్రమాలను ఏర్పాటు చేసింది. నారాయణపేట జిల్లా కేంద్రంలోని బారంబావి సమీపంలో ప్రభుత్వ వృద్ధాశ్రమం కొనసాగుతోంది.

పభుత్వ సహకారంతో, శ్రీ సిద్ధలింగేశ్వర స్వామి ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ ఆశ్రమంలో ప్రస్తుతం ఏడుగురు వృద్ధులు ఉంటున్నారు. ఇక్కడ వారికి సంరక్షణ, ఆరోగ్య పరిరక్షణ సేవలను అందిస్తున్నారు. ఉదయం వ్యాయామం, యోగాతో పాటు అవసరమైన వారికి మానసిక వైద్య నిపుణులతో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఉచిత వసతి, భోజనంతో పాటు అవసరమైన మందులు కూడా ఇస్తున్నారు.

సాయం చేయడంలో సంతృప్తి



మాది నారాయణపేట. వయసులో ఉన్నంత కాలం కుటుంబ పోషణ కోసం నేత పని చేశాను. నా వాళ్లు ఎందరో ఉన్నా, వృద్ధాప్యంలో నన్ను ఇక్కడ చేర్పించారు. రెండేళ్ల గా ఇక్కడే ఉంటున్నాను. తోటి వృద్ధులకు నా వంతు సాయం చేస్తున్నా. అదే నాకు సంతృప్తి నిస్తోంది.

- మనోహర్ జోరి

ఒంటరితనం అతి పెద్ద సమస్య



వృద్ధాప్యం వాస్తవం. ఈ వయసులో మనవారు ఎవరు? కాని వారెవరు? అనేది తెలిసిపోతోంది. జీవిత చర మాంకంలో ఒంటరిగా నివసిస్తూ, మానసిక సమస్యలతో బాధపడుతున్న వారికి వృద్ధాశ్రమం ఒక మంచి వేదిక అని చెప్పవచ్చు. ఎవరైనా వృద్ధులు ఒంటరితనంతో బాధపడుతుంటే, ఆశ్రమానికి రావొచ్చు. వారిని ఆదుకునేందుకు దాతలు ముందుకు రావాలి.

- సిద్ధిలింగేశ్వర స్వామి, ట్రస్ట్ అధ్యక్షుడు

విస్తృత ప్రచారం అవసరం



వృద్ధుల సంక్షేమం కోసం గత ప్రభుత్వం నారాయణపేటలో వృద్ధాశ్రమాన్ని ఏర్పాటు చేసింది. ఈ ఆశ్రమంపై సరైన ప్రచారం లేక, ఎంతో మంది వృద్ధులు సేవలను అందుకోలేకపోతున్నారు. ఈ ఆశ్రమం గురించి విస్తృతంగా ప్రచారం చేయాల్సిన అవసరం ఉంది. తద్వారా దాతలు కూడా ముందుకొచ్చే అవకాశం ఉంటుంది.

- ఎస్. రాజేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే

అమృతఫలం అందరికీ ఇష్టం

- జోరుగా సీతాఫలం విక్రయాలు
- 3 నెలల పాటు పేదలకు ఉపాధి



పాలిటెక్నిక్ కళాశాల ముందు సీతాఫల విక్రయించేందుకు సీతాఫలాల గంపలతో మహిళలు

వనపర్తి రూరల్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : పిల్లల నుంచి పెద్దల వరకు, సామాన్యుల నుంచి సంపన్నుల వరకు అందరూ ఇష్టంగా తినే సీతాఫలాల విక్రయాలు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో జోరుగా సాగుతున్నాయి. ఎటువంటి పురుగుల మందులు లేకుండా కొండలు, గుట్టల్లో సహజంగా పండే సీతాఫలానికి డిమాండ్ అధికంగా ఉంటుంది. ఈ ఏడాది వర్షాలు పుష్కలంగా పడటంతో విరివిగా కాయలు కాసి పండాయి. ఈ పండ్ల విక్రయాలతో గ్రామీణ పేదలకు దాదాపు మూడు నెలల పాటు ఉపాధి లభిస్తోంది. వనపర్తి జిల్లాలోని ఘనపూర్, పానగల్, వీపనగండ్ల, చిన్నంబావి, రేవల్లి, గోపాల్‌పేట, పెద్దమందడి మండలాల్లో ఈ పండ్లు అధికంగా లభిస్తాయి. గుట్టలు, అటవీ ప్రాంతాలు, పొలం గట్లపై పెరిగే ఈ చెట్ల నుంచి సీతాఫలాలను స్థానికులు మహిళలు, కూలీల సాయంతో సేకరించి, ఎద్దుల బండ్లు, వాహనాల్లో మండల కేంద్రాలు, పట్టణాలకు తీసుకొచ్చి విక్రయిస్తున్నారు. ప్రస్తుతం జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల, రాజీవ్ చౌరస్తా, కొత్త బస్టాండ్, బస్ డిపో సెంటర్లలో సీతాఫలాల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. పలువురు మహిళలు తెల్లవారుజామునే వచ్చి పండ్లను అమ్ముకొని సాయంత్రం గ్రామాలకు వెళ్లిపోతున్నారు. ఈ పండ్లు చిన్న గంపకు రూ.200, పెద్ద గంపకు రూ.1000 ధర పలుకుతోంది. మరికొందరు రైతులు, కూలీలు ఈ పండ్లను తీసుకొచ్చి వ్యాపారులు, మధ్యవర్తులకు అమ్ముతున్నారు. వారు తక్కువ ధరకు కొని, దుకాణాల్లో ఎక్కువ ధరకు విక్రయిస్తున్నారు. ఈ సీజన్లో అన్ని పండ్ల కన్నా సీతాఫలాలకే ఎక్కువ డిమాండ్ ఉంటుందని వారు చెప్తున్నారు.

నీరు పారేదెలా?

- అధ్వానంగా ఎంజీకేఎల్ఐ కాలువ
- ఏపుగా పెరిగిన జమ్ము, పిచ్చి మొక్కలు
- సాగునీరు పారేందుకు ఆటంకం



కాల్వలో ఏపుగా పెరిగిన జమ్ము, పిచ్చి మొక్కలు

పెద్దకొత్తపల్లి, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మహాత్మాగాంధీ ఎత్తిపోతల పథకం కాలువ అధ్వానంగా మారింది. నాగర్‌కర్నూల్ జిల్లా, పెద్దకొత్తపల్లి మండలంలోని దేవునితిర్మలాపూర్, జొన్నలబొగుడ, సాతాపూర్, వెన్నచెర్ల, కొత్తపేట, నారాయణపల్లి, గంట్రావుపల్లి, చెన్నపురాంపల్లి, కల్వకోల్ తదితర గ్రామాల సమీపంలో ఉన్న ఎంజీకేఎల్ఐ కాలువలో పిచ్చి మొక్కలు, జమ్ము ఏపుగా పెరిగింది. దీనికి తోడు కాలువలో మట్టి పేరుకుపోవడంతో నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతోంది. దీంతో పంటలకు సక్రమంగా నీరందడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలువ నిండుగా ప్రవహిస్తే, ముందుకు పారే అవకాశం లేక పొలాల్లోకి నీరు చేరి పంటలు దెబ్బతింటున్నాయని చెప్తున్నారు. కాలువలో జమ్ము, పిచ్చి మొక్కలను తొలగించాలని, పూడిక తీయించాలని సంబంధిత అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పిచ్చి మొక్కలు తొలగించాలి



ఎంజీకేఎల్ఐ కాలువలో ఏపుగా పెరిగిన జమ్ము, పిచ్చి మొక్కలను వెంటనే తొలగించాలి. పూడిక తీయకపోవడంతో నీరు సక్రమంగా పారడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలువకు మరమ్మతు చేపట్టాలి.

- బద్దుల ప్రవీణ్‌కుమార్ యాదవ్, రైతు, సాతాపూర్

కాలువను శుభ్రం చేయాలి



ఎంజీకేఎల్ఐ కాలువ మట్టితో పూడుకుపోయింది. జమ్ము, పిచ్చి మొక్కలు పెరగడంతో నీరు ముందుకు పారడం లేదు. సంబంధిత అధికారులు స్పందించి కాలువను శుభ్రం చేయించాలి.

- పిల్లి శివుడు, రైతు, దేవునితిర్మలాపూర్

వాగులో కొట్టుకుపోయిన బండి

- పొలానికి వెళ్తుండగా ప్రమాదం
- చనిపోయిన ఎద్దులు
- సురక్షితంగా బయటపడిన దంపతులు

కోడేరు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులో ఓ ఎద్దుల బండి కొట్టుకుపోయింది. బండికి కట్టిన రెండు ఆవులు మృతి చెందగా, రైతు దంపతులు సురక్షితంగా బయటపడ్డారు. నాగర్‌కర్నూల్ జిల్లా, కోడేరు మండల పరిధిలోని నాగులపల్లి గ్రామంలో మంగళవారం ఈ సంఘటన జరిగింది. బాధితులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన బోయ జక్కుల వెంకటస్వామి, భార్య అడివమ్మతో కలిసి మంగళవారం ఉదయం బండికి ఆవులను కట్టుకొని పొలానికి బయలు దేరారు. దారిలో ఉధృతంగా ప్ర వహిస్తున్న వాగును దాటుతుండగా, చక్రం గుంతలో దిగి, బండి బోల్తా పడింది. దీంతో ఆవుల మెడకు తలుగులు బిగుసుకు పోయి చనిపోయాయి.

రైతు దంపతులు కూడా కొంత దూరం కొట్టుకుపోయి వాగులోని జమ్ము చెట్లను పట్టుకొని, ఈదుకుంటూ ఒడ్డుకు చేరుకున్నారు. విషయం తెలుసుకున్న గ్రామస్థులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. తాళ్ల సహాయంతో చనిపోయిన ఆవులను, బండిని ఒడ్డుకు లాగారు. ఆవులు విలువ లక్ష రూపాయలు ఉంటుందని బాధితులు తెలిపారు. సంఘటనపై తహసీల్దార్ విజయ్‌కుమార్ పంచానామా నిర్వహించారు. వాగుపై వంతెన నిర్మించాలని గ్రామస్థులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

ఘనంగా ఆర్ఎస్ఎస్ శతాబ్ది వేడుకలు



మద్దూర్‌లో సమావేశంలో మాట్లాడుతున్న ఆర్ఎస్ఎస్ రాష్ట్ర సంఘటనా మంత్రి యాదిరెడ్డి

మద్దూర్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆర్ఎస్ఎస్ శతాబ్ది వేడుకలను నారాయణపేట జిల్లా మద్దూర్‌లో మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఆర్ఎస్ఎస్ రాష్ట్ర సంఘటనా మంత్రి యాదిరెడ్డి జెండాను ఆవిష్కరించారు. అనంతరం వందేళ్ల కాలంలో ఆర్ఎస్ఎస్ చేసిన సేవా కార్యక్రమాల గురించి యాదిరెడ్డి వివరించారు. దేశం కోసం స్వయం సేవక్ సభ్యులు అంకితభావంతో పనిచేస్తున్నారన్నారు. ఇకముందు కూడా దేశం అభ్యున్నతి కోసం ఆర్ఎస్ఎస్ పాటుపడుతోందన్నారు. కార్యక్రమంలో అతిథులు కట్కం కృష్ణయ్య, సూర్యప్రకాశ్, రాంరెడ్డి, విజయ్, ప్రశాంత్, సుదర్శన్‌తో పాటు మండల ఆర్ఎస్ఎస్ సభ్యులు పాల్గొన్నారు.

నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు కొనసాగించాలి

- యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు రామ్మోహన్



సమావేశంలో మాట్లాడుతున్న యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు రామ్మోహన్

గద్వాల టౌన్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును యధావిధిగా కొనసాగించాలని తెలంగాణ బిల్డింగ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు రామ్మోహన్ కోరారు. మంగళవారం గద్వాల పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో యూనియన్ జిల్లా మూడవ సభ నిర్వహించారు. మహాసభలో మాట్లాడిన రామ్మోహన్, నిర్మాణ రంగం కార్మికుల సంక్షేమం కోసం సీఐటీయూ సాధించిన నిరంతర పోరాటం వల్లే కేంద్ర ప్రభుత్వం 1996లో సంక్షేమ బోర్డు చట్టం తీసుకువచ్చిందని, ఉమ్మడి రాష్ట్రంలో 2009నుంచి అమలులోకి వచ్చిందని అన్నారు. కేంద్రం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాల వల్ల పోరాడి సాధించుకున్న చట్టాలు నిర్వీర్యం కానుండగా కార్మికులు శ్రమ దోపిడీకి గురయ్యే ప్రమాదం ఉందన్నారు. ఐక్యపోరాటాల ద్వారా వీటిని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. అనంతరం జిల్లా నూతన కమిటీని ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా రామకృష్ణ, ఉపాధ్యక్షులుగా కబీర్, పాంటన్న, కార్యదర్శిగా వీవీ నరసింహ, సహాయ కార్యదర్శులు ఆంజనేయులు, భీమేశ్, కోశాధికారిగా సీతారాములు, కమిటీ సభ్యులుగా కృష్ణ, మల్లి, బుచ్చన్న, ఏసన్న, రామాంజి, మధును ఎన్నుకున్నారు. సమావేశంలో జిల్లాలోని అన్ని మండలాల ప్రతిని ధులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

వరి చేనులో కింద పడి రైతు మృతి



మృతి చెందిన రాగుల బాలస్వామి

మిడ్జిల్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : పురుగుల మందు కొట్టేందుకు వరి పొలానికి వెళ్లిన రైతు ప్రమాదవశాత్తు మడిలో కిందపడి మృతి చెందాడు. ఎస్ఐ శివనాగేశ్వర్‌నాయుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మహబూబ్‌నగర్ జిల్లా, మిడ్జిల్ మండల కేంద్రానికి చెందిన రాగుల బాలస్వామి(32) మంగళవారం అదే గ్రామానికి చెందిన యాదయ్య వరి చేనులో పురుగుల మందు కొట్టేందుకు వెళ్లాడు. కాలు జారి వరి మడిలో పడిపోయాడు. బురదలో ముఖం కురుకపోయి మృతి చెందాడు. కొంతసేపటికి చుట్టుపక్కలవారు గమనించి, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. సంఘటనపై అతడి భార్య రాగుల మంజుల పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని జడ్చర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు చెప్పారు.

విద్యుదాఘాతంతో
ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి మృతి



మధుసూదన్ (ఫైల్)

పాన్‌గల్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : విద్యుదాఘాతంతో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి మృతి చెందిన సంఘటన మంగళవారం సాయంత్రం మండలంలో చోటు చేసుకుంది. గ్రామస్థులు కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన మధుసూదన్(28) విద్యుత్ శాఖలో ఔట్‌సోర్సింగ్ స్పాట్ బిల్లర్‌గా పని చేస్తున్నాడు. సబ్ స్టేషన్ సమీపంలో రైతుల పొలాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఈ విషయాన్ని కొందరు అతడికి తెలపడంతో పరిశీలించేందుకు పొలాల వద్దకు వెళ్లాడు. ట్రాన్స్‌ఫార్మర్ వద్ద సమస్యను సరి చేసే క్రమంలో విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషయంపై హెడ్ కానిస్టేబుల్ యాదగిరిని వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదూ అందలేదని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో
ఇద్దరి దుర్మరణం

- బైక్ అదుపుతప్పి కింద పడిన యువకులు
- వారిని ఢీకొన్న గుర్తు తెలియని వాహనం

మూసాపేట, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : దిచక్రవాహనంపై వెళ్తున్న ఇద్దరు యువకులు అదుపు తప్పి కిందపడ్డారు. ఆదే సమయంలో గుర్తు తెలియని వాహనం వారిని ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందారు. ఈ సంఘటన మహబూబ్‌నగర్ జిల్లా, అడ్డాకుల మండలంలోని శాఖాపూర్ వద్ద మంగళవారం రాత్రి జరిగింది. మూసాపేట ఎస్ఐ శ్రీనివాస్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కొత్తకోట మండలం చర్లపల్లి గ్రామానికి చెందిన రాజు(21), గణేశ్ (20)లు ద్విచక్రవాహనంపై హైదరాబాద్ వైపు వెళ్తున్నారు. 44వ జాతీయ రహదారిపై శాఖాపూర్ సమీపంలో సెడన్ బ్రేక్ వేయడంతో ద్విచక్రవాహనం అదుపుతప్పి కింద పడ్డారు. అదే సమయంలో గుర్తు తెలియని వాహనం వారిని ఢీకొనడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందారు. డ్రైవర్‌గా పని చేస్తున్న రాజుకు భార్య, కుమార్తె ఉన్నారు. మృతుడైన గణేశ్‌కు వివాహం కాలేదు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాలను జిల్లా ఆసుపత్రికి తరలించారు. సంఘటనపై కేసు నమోదు చేసి, విచారణ చేపట్టినట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

విద్యుదాఘాతంతో
రెండు మేకలు మృతి

మన్ననూర్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, అమ్రాబాద్ మండలంలోని వెంకటేశ్వర్లబావి గ్రామ పరిధిలోని చౌటగూడెంలో విద్యుదాఘాతంతో రెండు మేకలు మృతి చెందాయి. గ్రామానికి చెందిన ఉడుతనూరి ఈదమ్మకు చెందిన మేకలు మేతమేస్తూ ఇంటి సమీపంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లి విద్యుదాఘాతంతో చనిపోయాయి. ట్రాన్స్‌ఫార్మర్‌ను నివాస గృహాలకు దూరంగా తరలించాలని పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని బాధితురాలు ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రైవేటు ఆసుపత్రుల్లో పదో తరగతి ఫార్మసిస్టులు!

- అసలు ఫార్మసిస్టులు లైసెన్సులకే పరిమితం
- ప్రజల ప్రాణాలతో యజమానుల చెలగాటం
- పట్టించుకోని ఔషధ నియంత్రణ శాఖ అధికారులు

ఆంధ్రజ్యోతి నిఘా



సాయిశిల్ప ఆసుపత్రిలో ఎలాంటి విద్యార్హతలు లేకుండా మందులు ఇస్తున్న వ్యక్తి

మహబూబ్‌నగర్(వైద్యవిభాగం) సెప్టెంబర్ 30 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు ఆసుపత్రులు ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నాయి. అందుకు వారు నిర్వహించే మెడికల్ దుకాణాలే ఉదాహరణ. కోట్ల రూపాయలు పెట్టి ఆసుపత్రులు ఏర్పాటు చేసుకొని, వేలకు వేలు ఫీజులు వసూలు చేయడమే కాకుండా, ఫార్మసిస్టులు లేకుండా మెడికల్ దుకాణాలను నడిపిస్తున్నారు. పదవ తరగతి, ఇంటర్ చదివే విద్యార్థులను తక్కువ జీతానికి పనిలో పెట్టుకుంటున్నారు. వారితోనే యాంటిబయోటిక్స్, ఇతర మందులు ఇప్పిస్తున్నారు. ఫార్మసీ లైసెన్సు ఉన్న వారి సర్టిఫికెట్లను అద్దెకు తీసుకొని అనర్హులతో మెడికల్ దుకాణాలను కొనసాగిస్తున్నారు. అయితే ప్రతీ తనిఖీలు చేస్తూ, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న వారిపై చర్యలు తీసుకోవలసిన ఔషధ నియంత్రణ శాఖ అధికారులు అటువైపు కూడా చూడటం లేదన్న విమర్శలున్నాయి.

200కు పైగా ప్రైవేటు ఆసుపత్రులు

మహబూబ్‌నగర్ జిల్లాలో 200లకు పైగా ప్రైవేటు ఆసుపత్రులు ఉన్నాయి. అందులో జిల్లా కేంద్రంలోనే దాదాపు 105 వరకు ఆసుపత్రులున్నాయి. వాటిలో ఒక్క ఆసుపత్రిలోని మెడికల్ షాపుల్లో కూడా ఫార్మసిస్టులు లేరు. అన్ని ఆసుపత్రుల్లో 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ చదువుతున్న విద్యార్థులే ఫార్మసిస్టులుగా చెలామణి అవుతున్నారు. మరికొన్ని చోట్ల నర్సింగ్ విద్యార్థులు, లేదా వేరే మెడికల్ షాపుల్లో పని చేసిన అనుభవం ఉన్న వారిని ఫార్మసిస్టులుగా నియమించుకుంటున్నారు. వాస్తవానికి ఫార్మసిస్టు లేకుండా ఎలాంటి మందులూ ఇవ్వడానికి వీలు లేదు. కానీ ఆ నిబంధనలను ప్రైవేటు ఆసుపత్రుల యజమానులు పట్టించుకోవడం లేదు.

చర్యలు తీసుకుంటాం

మెడికల్ షాపులను తనిఖీ చేస్తున్నాం. ఫార్మసిస్టులు లోని దుకాణాల యజమానులకు నోటీసులు ఇచ్చాం. ఇకపై ప్రైవేటు ఆసుపత్రుల్లోని మెడికల్ దుకాణాలను కూడా తనిఖీ చేస్తాం. నిబంధనలు వారిపై చర్యలు తీసుకుంటాం.

\- విశ్వంత్‌రెడ్డి, డ్రగ్ ఇన్‌స్పెక్టర్



బాయమ్మతోటలో ఫార్మసీ సర్టిఫికెట్ లేకపోయినా మెడికల్ షాపు నడిపిస్తున్న వ్యక్తి

బినామీ పేర్లతో దుకాణాలు

ప్రైవేటు ఆసుపత్రుల్లో ఉండే మెడికల్ దుకాణాలు బినామీ పేర్లతో నడుస్తున్నాయి. ప్రతీ షాపులో బి-ఫార్మసీ, డి-ఫార్మసీ చేసిన వారి పేరు మీద లైసెన్సులు తీసుకొని దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారు. పేరుకు మాత్రమే ఫార్మసీ సర్టిఫికెట్ ఉంటుంది. కానీ అర్హత లేని వారితో దుకాణాలను కొనసాగిస్తున్నారు.

వాటిలో మచ్చుకు కొన్ని...

జిల్లా కేంద్రంలోని నిలోఫర్ చిన్నపిల్లల ఆసుపత్రిలో చెన్నకేశవ మెడికల్ పేరుతో లైసెన్సు ఉంది. కాని ఆ ఫార్మసిస్టు ఒక్కసారి కూడా దుకాణంలో ఉండరు. దుకాణం యజమాని అల్లుడు, ఇంటర్ చదువుతున్న విద్యార్థి, అలాగే డిగ్రీ చదువుతున్న కుమార్తె షాపులో ఉంటూ మందులు ఇస్తున్నారు.

- సాయిశిల్ప ఆసుపత్రిలో ఓ పేరున్న మెడికల్ దుకాణం యాజమాని కుమార్తె పేరుతో లైసెన్సు తీసుకొని నిర్వహిస్తున్నాడు. ఎలాంటి అర్హతా లేని వ్యక్తిని ఫార్మసిస్టుగా పెట్టుకున్నారు. అతడితో పాటు, మరో పదవ తరగతి చదువుతున్న బాలుడు మందులు ఇస్తున్నారు.
- బాయమ్మతోటలో ఎలాంటి విద్యార్హతలు, లైసెన్సు లేకుండా మెడికల్ దుకాణం నడిపిస్తున్నారు. పైగా తాను బీహెచ్ఎంఎస్ చదివానని, సర్టిఫికెట్‌ను రిజిస్టర్ చేసుకోలేదని చెప్తున్నాడు. అంతేకాకుండా అనుమతి లేకుండా క్లీనిక్‌ను కూడా కొనసాగిస్తున్నాడు.
- పట్టణంలోని పాత డీఈవో ఆఫీసు చౌరస్తాలో కూడా శ్రావణి ఆసుపత్రిలోనూ ఎలాంటి విద్యార్హతలు లేని వ్యక్తి ఫార్మసీని నడిపిస్తున్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకుంటాం

- క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి



సుకూరు లింగంపల్లి గ్రామంలో రైతులతో వివరాలు అడిగి తెలుసుకుంటున్న క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి

కృష్ణ, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : వరదలతో పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతులకు ఆదుకోవడమే ప్రభుత్వ లక్ష్యమని క్రీడలు, మత్స్య శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. ఎగువన కురుస్తున్న భారీ వర్షాలతో కృష్ణా, భీమా నదులకు వరద పోటెత్తుతోంది. దీంతో నారాయణపేట జిల్లా, కృష్ణ మండలంలోని సుకూరులింగంపల్లి, ఐనపూరు, తంగడిగి, కూసుమూర్తి, కళ్లహళ్లి, హిందూపూర్ తదితర గ్రామాల పరిధిలో వరి పంటలు నీట మునిగాయి. ఆయా గ్రామాల్లో మంత్రి వాకిటి శ్రీహరి మంగళవారం పర్యటించారు. నీట మునిగిన పంటలను పరిశీలించి, రైతులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. దత్త భీమేశ్వరాలయాన్ని ఆయన వెంట నాయకులు లక్ష్మారెడ్డి, కృష్ణయ్య గౌడ్, రాజప్పగౌడ, ఆనంద్‌గౌడ్, పల్లె సురేశ్, సర్పరాజ్, సంతోష్‌శెట్టి, రవిగౌడ, సిద్ధలింగారెడ్డి గౌడ, నాగేంద్ర ఉన్నారు.

అధికారుల పరిశీలన

కృష్ణ మండల పరిధిలోని సుకూరులింగంపల్లి, తంగడిగి , కూసుమూర్తి, కళ్లహళ్లి, హిందూపూర్, గుడెబల్లూరు, ముడుమాల్ తదితర గ్రామాల శివారులో నీట మునిగిన వరి, పత్తి పొలాలను జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జాన్‌సుధాకర్ సిబ్బందితో కలిసి పరిశీలించారు. ప్రాథమిక అంచనా మేరు 1,259 ఎకరాల వరి, 20 ఎకరాల పత్తి పంట నీట మునిగినట్లు తెలిపారు. ఆయన వెంట ఏఈవో అభిలాష్ ఉన్నారు.

రైతులకు న్యాయం చేయాలి



భీమా నది ఒడ్డున వరి పొలాలను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

పంటలు నీట మునిగి నష్టపోయిన రైతులను ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి కోరారు. వరదలతో నీట మునిగిన పంట పొలాలను మంగళవారం ఆయన పరిశీలించి రైతులతో మాట్లాడారు. పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. క్షేత్ర స్థాయి పరిశీలించి, రైతులకు న్యాయమైన పరిహారం అందించాలన్నారు. ఆయన వెంట సర్పంచుల సంఘం జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు శివప్ప, మౌనేశ్, సురేశ్, శివరాజ్ పాటిల్ ఉన్నారు.

కొనసాగుతున్న నీటి విడుదల

మక్తల్ రూరల్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా, మక్తల్ మండలంలోని సంగంబండ జలాశయం నుంచి నీటి విడుదల కొనసాగుతోంది. ఎగువ నుంచి పెద్ద వాగుకు వరద ఉధృతి పెరగడంతో మంగళవారం కూడా 1 గేటు ద్వారా నీటిని దిగువకు వదులుతున్నారు. పస్తుతం జలాశయానికి 1000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదవుతున్నట్లు డీఈఈ సురేశ్ తెలిపారు. అంతే మొత్తంలో నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు తెలిపారు. రిజర్వాయర్ పూర్తి నీటి నిల్వ సామరథ్యం 3.313 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 2.69 టీఎంసీల నీరు నిల్వ ఉందని చెప్పారు.

పర్యాటక ప్రాంతంగా
సోమశిల అభివృద్ధి

- పీఆర్‌టీయూ టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పులగం దామోదర్‌రెడ్డి



సోమశిల లలితాంబిక సోమేశ్వర ఆలయం ముందు కుటుంబ సమేతంగా పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పులగం దామోదర్‌రెడ్డి

కొల్లాపూర్ ,సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లాలోని సోమశిల క్షేత్రం పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందుతోందని పీఆర్‌టీయూ టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పులగం దామోదర్‌రెడ్డి అన్నారు. సోమశిలలోని లలితాంబిక సోమేశ్వర ఆలయాన్ని మంగళవారం ఆయన కుటుంబ సమేతంగా దర్శించుకుని పూజలు చేశారు. అంతకు ముందు యూనియన్ జిల్లా మాజీ అధ్యక్షుడు రామచంద్రరావు, కొల్లాపూర్ మండల అధ్యక్షుడు శ్రీకాంత్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు సీవీ రావు వారికి ఘనంగా స్వాగతం పలికారు. ఆలయ విశిష్టత ఆలయం పురోహితులు వారికి వివరించారు. అనంతరం వారు నది పరివాహక ప్రాంతాన్ని సందర్శించారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు



వివరాలను తెలుపుతున్న సీఐ కృష్ణ, ఎస్ఐ నరేశ్ కుమార్

గోపాల్‌పేట, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఓ ఇంట్లో చోరీ చేసిన నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచామని వనపర్తి సీఐ కృష్ణ ఎస్ఐ నరేశ్ కుమార్ తెలిపారు. కేసు వివరాలను మంగళవారం పోలీస్ స్టేషన్‌లో తెలియజేశారు. మండలంలోని బుద్ధారం గ్రామ పరిధిలోని పాట్టిగడ్డ తండాకు చెందిన మంగమ్మ భార్త గోపాల్ హైదరాబాద్‌లో ఉంటున్నాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో బుద్ధారం గ్రామానికి చెందిన ఆవుల అశోక్ మంగమ్మ ఇంట్లో చొరబడి బీరువాని పగలగొట్టి రూ.80 వేల నగదును, వెండి వస్తువులను ఎత్తికెళ్లాడు. మరుసటి రోజు ఇంటికి వచ్చిన మంగమ్మ గోపాల్ బీరువాలోని నగదు కనిపించపోవడంతో స్థానిక పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తులో భాగంగా ఆవుల అశోక్‌ను విచరించగా... చోరీ తానే చేశానని ఒప్పుకున్నాడు. ఒక సెల్‌ఫోన్, కాళ్ల పట్టీలను స్వాధీనం చేసుకొని నిందితుడిని కోర్టులో హాజరు పరిచామని చెప్పారు.



మహబూబ్‌నగర్‌లో బాలుర జూనియర్ కళాశాల మైదానంలో బతుకమ్మ ఆడుతున్న వివిధ శాఖల మహిళా ఉద్యోగులు





వనపర్తి కలెక్టరేట్ ఆవరణలో బతుకమ్మ ఆడుతున్న మహిళా ఉద్యోగులు

ఘనంగా 'సద్దుల' సంబురం

- వనపర్తి, నారాయణపేట జిల్లా కేంద్రాల్లో వేడుకలు
- మహిళలతో కలిసి బతుకమ్మ ఆడిన కలెక్టర్లు, ఎస్పీలు

వనపర్తి రాజీవ్ చౌరస్తా/ నారాయణపేట/ మహబూబ్‌నగర్ న్యూటౌన్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా శరన్నవరాత్రి ఉత్సవాలు, బతుకమ్మ సంబురాలు ఘనంగా కొనసాగుతున్నాయి. అందులో భాగంగా మంగళవారం వనపర్తి, నారాయణపేట, మహబూబ్‌నగర్ జిల్లాల్లో సద్దుల బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. వనపర్తి జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం ఆవరణలో సెర్ప్, మెప్మా, సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో నిర్వహించిన సంబురాలకు కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఎస్పీ గిరిధర్ రావుల ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. రంగురంగుల పూలతో తయారు చేసిన బతుకమ్మలకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్, ఎస్పీలు మహిళలతో కలిసి బతుకమ్మ ఆడి అందరినీ ఉత్సాహ పరిచారు. అద్భుతంగా తీర్చి దిద్దిన బతుకమ్మలకు బహుమతులు అందించారు. మెప్మా మహిళా సమాఖ్య ప్రథమ, పురపాలక శాఖ ద్వితీయ, వ్యవసాయ శాఖ తృతీయ బహుమతులను సొంతం చేసుకున్నాయి. నాలుగో స్థానంలో కలెక్టరేట్ నిలిచింది. కార్యక్రమంలో వివిధ శాఖల మహిళా అధికారులు, సిబ్బంది, చిన్నారులు పాల్గొన్నారు.

- నారాయణపేట పట్టణంలోని కలెక్టర్ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన బతుకమ్మ సంబురాలకు కలెక్టర్ సిక్తా పట్నాయక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గౌరీ మాతకు కలెక్టర్ పూజలు చేశారు. సాయంత్రం 5 గంటలకు ప్రారంభమైన వేడుకల్లో మహిళా ఉద్యోగులు, యువతులు బతుకమ్మ పాటలకు ఆనందంగా నృత్యం చేశారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ ప్రాంగణం పండుగశోభను సంతరించుకున్నది.



మహిళలతో కలిసి బతుకమ్మ ఆడుతున్న కలెక్టర్, ఎస్పీ



నారాయణపేటలో మహిళలతో కలిసి బతుకమ్మ ఆడుతున్న కలెక్టర్



మహబూబ్‌నగర్‌లోని శ్రీ నిలయం అపార్ట్‌మెంట్ వద్ద బతుకమ్మ వేడుకల్లో మహిళలు

- మహబూబ్‌నగర్ పట్టణంలోని బాలుర జూనియర్ కళాశాల మైదానంలో సద్దుల బతుకమ్మ సంబురాలను ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో వివిధ శాఖల మహిళా అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. మెప్మా, సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలు, ఉద్యాన శాఖ, డీఆర్‌డీవో తదితర శాఖల ఆధ్వర్యంలో అందంగా అలంకరించిన బతుకమ్మలు కనువిందు చేశాయి. సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి వరకు బతుకమ్మ ఆడుతూ మహిళలు సందడి చేశారు. బతుకమ్మ వేడుకలను విజయవంతం చేసిన వివిధ శాఖల అధికారులు, సిబ్బందికి కలెక్టర్ విజయేందిర బోయి అభినందనలు తెలిపారు.

న్యూస్ బాక్స్

ఈనెల 3 వరకు మార్కెట్ యార్డుకు సెలవులు

నారాయణపేట, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): దసరా పండుగ దృష్ట్యా నారాయణపేట వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం నుంచి క్రయవిక్రయాలు జరగవని చైర్మన్ శివారెడ్డి మంగళవారం తెలిపారు. రైతులు యార్డుకు ధాన్యాన్ని తీసుకురావొద్దన్నారు. నాల్గో తేదీ నుంచి క్రయవిక్రయాలు కొనసాగుతాయన్నారు.

రేపు జెండా ఊరేగింపు

నారాయణపేట న్యూటౌన్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): దసరా పండుగ సందర్భంగా గురువారం మధ్యాహ్నం 3 గంటలకు ఆర్య సమాజం నుంచి బారం బావి వరకు జెండా ఊరేగింపు, సాయంత్రం 6 గంటలకు బహిరంగ సభ ఉంటుందని భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర జోనల్ కార్యదర్శి జి.వెంకోబా మంగళవారం తెలిపారు. కార్యక్రమంలో హిందూ బంధువులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

'గురుకుల పోస్టులు మెరిట్ అభ్యర్థులతో భర్తీ చేయాలి'

మక్తల్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): గురుకుల పాఠశాలల్లో ఖాళీలను మెరిట్ అభ్యర్థులతో భర్తీ చేయాలని కోరుతూ మంగళవారం గురుకుల పాఠశాల అభ్యర్థులు మంత్రి వాకిటి శ్రీహరికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా అభ్యర్థులు నర్సింహ, శివరాజ్, అలీంపాషలు మాట్లాడుతూ గతంలో గురుకుల పాఠశాలల్లో 1800ల మంది నిరుద్యోగులకు అన్యాయం జరిగిందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి హైకోర్టు తీర్పును గౌరవించి మెరిట్ అభ్యర్థులకు న్యాయం చేయాలని కోరారు. చెన్నారెడ్డి, రాకేష్, సుహాన్‌రాజు ఉన్నారు.

దసరా కట్ట ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన

మరికల్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో మంగళవారం విశ్వ హిందూ పరిషత్, బజరంగ్‌దళ్, గ్రామస్థుల ఆధ్వర్యంలో దసరా కట్ట ధ్వజస్తంభానికి వేదమంత్రోచ్ఛరణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. దసరా ఉత్సవాలు వైభవంగా నిర్వహించాలని, కట్ట వద్ద కొత్త స్తంభం ఏర్పాటు చేయాలని గ్రామస్థులు ఏకగ్రీవంగా చేసిన తీర్మానం మేరకు ధ్వజస్తంభాన్ని ఏర్పాటుచేసి పూజలు చేశారు. అంతకుముందు మహిళలు ధ్వజస్తంభానికి మంగళ హారతులతో ఘన స్వాగతం పలుకుతూ, గ్రామ పురవీధుల గుండా ఊరేగించారు. గ్రామ అఖిలపక్ష నాయకులు పాల్గొన్నారు.

జమ్మిచెట్టు దగ్గర పరిశుభ్రత

మరికల్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): దసరాను పురస్కరించుకొని మంగళవారం మరికల్ పట్టణ పంచాయతీ కార్యదర్శి శ్యాంసుందర్‌రెడ్డి జమ్మిచెట్టు పరిసరాలను, పరిశుభ్రత పనులను చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురువారం సాయంత్రం జమ్మిచెట్టు వద్ద పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామని, ప్రజలు హాజరు కావాలని కోరారు.

తిర్మల్‌దేవునిపల్లి, కొల్లంపల్లి అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి ఎంపీ ఆదేశాలు

నారాయణపేటరూరల్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తిర్మల్ దేవునిపల్లి నుంచి కొల్లంపల్లి వరకు ఆరు కిలోమీటర్ల అప్రోచ్ రోడ్డుకు ప్రతిపాదనలు వెంటనే తయారు చేసి రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని పంచాయతీరాజ్ అధికారులను ఎంపీ డీకే అరుణ ఆదేశించినట్లు బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు పి.శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల ఆ గ్రామంలో ఎంపీ పర్యటించగా గ్రామస్థులు ఎంపీ దృష్టికి ప్రతిపాదన తీసుకురాగా ఆమె స్పందించినట్లు శ్రీనివాస్ పేర్కొన్నారు.

కుక్కల బెడద నుంచి కాపాడాలి

నారాయణపేట టౌన్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో వీధి కుక్కల బెడద రోజురోజుకు ఎక్కువైందని వాటి బారి నుంచి రక్షించాలని స్థానికులు కోరుతున్నారు. పట్టణంలోని శ్రీనగర్ కాలనీ, శాసన్‌పల్లి రోడ్డు, గాంధీనగర్, సింగార్‌బేస్ వీధులతో పాటు పలు కాలనీల్లో కుక్కలు విచ్చలవిడిగా తిరుగుతున్నాయని, దీంతో చిన్నారులు బయటికి వెళ్లాలంటేనే, పంపాలంటేనే భయపడుతున్నారని 3వ వార్డు మాజీ కౌన్సిలర్ కాకర్ల నారాయణమ్మ పేర్కొన్నారు. విషయాన్ని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లినట్లు ఆమె తెలిపారు. కుక్కలను కట్టడి చేసి చికిత్సలు నిర్వహించాలని కోరారు.

'క్రిస్టియన్లకు ఎస్సీ మాదిగ సర్టిఫికెట్లు ఇవ్వొద్దు'

కొత్తపల్లి, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భూనీడు గ్రామంలో నిజమైన ఎస్సీ మాదిగలకు మాత్రమే కులం సర్టిఫికెట్లను జారీ చేసి స్థానిక ఎన్నికల్లో రిజర్వేషన్ వచ్చేలా చూడాలని మంగళవారం ఆ గ్రామస్థులు తహసీల్దార్ జయరాములు, ఎంపీడీవో కృష్ణారావుకు వినతిపత్రం ఇచ్చారు. బొబ్బిలి సుధాకర్‌రెడ్డి, కోట్ల రవీందర్‌రెడ్డి, హన్మంతురెడ్డి, కుమ్మరి వెంకట్, తిరుపతిరెడ్డి, గోకరప్ప తదితరులున్నారు.

'మేరా దేశ్ పహలే'లో నాగూరావు

నారాయణపేట న్యూటౌన్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో మంగళవారం నిర్వహించిన 'మేరా దేశ్ పహలే' కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు నాగూరావు నామాజీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ ముందు దేశం తరువాత పార్టీ ఆ తరువాతే కుటుంబం అని, ఏ స్వార్థం లేకుండా పనిచేయాలని అదే స్ఫూర్తితో మన ప్రధాని పనిచేస్తున్నారని తెలిపారు.

రోడ్డును బాగు చేయరూ..



బురదగా మారిన నర్వ నుంచి లక్కర్‌దొడ్డి మీదుగా కొత్తపల్లి గ్రామానికి వెళ్లే రోడ్డు

నర్వ, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): వర్షం కురిస్తే చాలు మండలంలోని మట్టి రోడ్లు బురదమయం అవుతున్నాయి. మండల కేంద్రం నుంచి లక్కర్‌దొడ్డి, కొత్తపల్లి మీదుగా పెద్ద కడుమూర్ వరకు సుమారు 10 కిలోమీటర్ల మేర మట్టి రోడ్డు ఉంది. ఈ రోడ్లలో ప్రయాణించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు ప్రజలు, వాహనదారులు వాపోతున్నారు. ఈ వారంలో కురిసిన వర్షాలకు ఈ రోడ్లన్నీ బురదమయమయ్యాయి. ప్రస్తుతం ఆ రోడ్లలో ప్రయాణించలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతేడాది వర్షాకాలంలో కురిసిన వర్షానికి మట్టి రోడ్లు కోతకు గురై గుంతలు ఏర్పడ్డాయి. మళ్లీ ఇప్పుడు కురుస్తున్న వర్షాలకు గుంతల్లో నీరు నిలవడంతో రోడ్డంతా బురదమయం అవుతోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా ఈ రోడ్లు బాగుపడడం లేదంటున్నారు. ఈ రోడ్లపై తమ గ్రామాల వాసులకు తిప్పలు తప్పడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుని మట్టి రోడ్లను బీటీగా మార్చాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

గుంతల రోడ్లతో తీవ్ర ఇబ్బందులు



మండల కేంద్రం నుంచి లక్కర్‌దొడ్డి, కొత్తపల్లిలో రోడ్లు అధ్వానంగా మారాయి. పెద్దపెద్ద గుంతలు ఏర్పడి ప్రయాణానికి పనికిరాకుండా మారాయి. ముఖ్యంగా పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ఇప్పటికైనా రోడ్ల అభివృద్ధిపై దృష్టి సారించాలి.

- రాజారెడ్డి, కొత్తపల్లి

యేటా ఈ తిప్పలు పడాల్సిందేనా



వర్షం వచ్చినప్పుడల్లా బురద రోడ్లపై ప్రయాణం చేయాలంటేనే ఇబ్బంది అవుతోంది. ప్రతీయేటా ఈ తిప్పలు పడాల్సిందేనా? మా బతుకులు మారవా? ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు రోడ్డు వేసి బాగు చేయండి.

- అమృత్‌రెడ్డి, లక్కర్‌దొడ్డి

మహిషాసుర మర్దినిగా అమ్మవారు

నారాయణపేట, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం తొమ్మిదో రోజు పేట జిల్లాలోని ఆలయాలు, మండపాల్లో అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. నారాయణపేట శక్తిపీఠాన్ని సీరియల్ నటి రాగిణి సందర్శించారు. యజ్ఞంలో ఆమెతో పాటు, కీర్తి, పవన్‌ధరక్‌లు పాల్గొన్నారు. విద్వాన్ పవన్‌కుమార్‌శర్మ భక్తులనుద్దేశించి ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. కార్యక్రమంలో స్వామి శాంతానంద, విద్వాన్‌విశ్వవసు పురోహిత్, శివానంద్, ట్రస్ట్ సభ్యులు దోమ సుధాకర్, నందిరాజశేఖర్, గంగాధర్‌రెడ్డి తదితరులున్నారు. శక్తిపీఠంలో అమ్మవారు దుర్గాదేవిగా, పేట అశోక్‌నగర్‌లోని మాలాంబికాదేవి ఆలయంలో దుర్గాదేవిగా, బ్రాహ్మణవాడి చౌడేశ్వరి దేవాలయంతో పాటు సింగారం శ్రీగిరి పీఠంపై అమ్మవారు మహిషాసుర మర్దినిగా, అంబాభవానీ ఆలయంలో మహంకాళీ మాతగా, వైష్ణవీ దేవాలయంలో దుర్గాదేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు.

అలాగే నారాయణపేటలోని మాణిక్‌శాస్త్రి నివాసంలో వేంకటేశ్వరస్వామిని ప్రతిష్ఠించి దసరా ఉత్సవాలు జరుపుతున్నారు. ప్రత్యేక పూజలతో పాటు రాత్రి 8 గంటలకు శ్రీనివాస మహత్యపురాణం నిర్వహిస్తున్నారు. దసరా పండుగ రోజు శ్రీనివాసకల్యాణ మహోత్సవాలు జరుగుతాయని భక్తులు పాల్గొనాలని ఆయన కోరారు. రాఘవేంద్రస్వామి ఆలయంలో దసరా ఉత్సవాల్లో భాగంగా శ్రీనివాస మహత్య పురాణాన్ని జ్యోషి రఘుప్రేమ్ వివరిస్తున్నారు.





పేట వైష్ణవీదేవి, మాలాంబిక ఆలయాల్లో దుర్గాదేవి అలంకరణల్లో అమ్మవారు





చౌడేశ్వరి, అంబాభవానీ ఆలయాల్లో మహిషాసురమర్దిని, మహంకాళీ మాతగా..



పేట శక్తిపీఠంలో అమ్మవారిని దర్శించుకున్న సీరియల్ నటి రాగిణి

మాణిక్య క్షేత్రాన్ని దర్శించుకున్న కలెక్టర్

» క్షేత్రంలోని పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు



ప్రత్యేక పూజలు నిర్వహించిన కలెక్టర్ సిక్తా పట్నాయక్‌ను ఆశీర్వదిస్తున్న పండితులు

దామరగిద్ద, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లా సరిహద్దులో ఉన్న యానగుంది మాణిక్యగిరి క్షేత్రంలో విజయదశమి ఉత్సవాల్లో భాగంగా వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు, భవానీమాత నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం కలెక్టర్ సిక్తా పట్నాయక్ మాణిక్య క్షేత్రంలో వీరధర్మజమాత, వేంకటేశ్వరస్వామి, భవానీమాత, శివాలయంతో పాటు క్షేత్రంలోని పలు ఆలయాలను సందర్శించి, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం క్షేత్రంలో ప్రతిష్ఠాపన చేస్తున్న కోటి లింగాలను సందర్శించారు. ట్రస్టు కార్యదర్శి శివయ్యస్వామి క్షేత్రం గురించి, మాణికేశ్వరి గురించి కలెక్టర్‌కు వివరించారు. ట్రస్టు సభ్యులు మందార్, సుమన్, బండి శివరాంరెడ్డి ఉన్నారు.

తాయమ్మ ఆలయంలో కమిషనర్..

నారాయణపేట టౌన్ : శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం మునిసిపల్ కార్యాలయ ఆవరణలో గల తాయమ్మ దేవాలయంలో కమిషనర్ నరసయ్య, ఇంజనీర్ మహేష్, సిబ్బంది పూజలు నిర్వహించారు.

దుర్గామాతలకు..

మరికల్ : మండల కేంద్రంలోని భ్రమరాంబిక మల్లికార్జునస్వామి ఆలయంలో ప్రతిష్ఠించిన దుర్గామాతకు డీఎస్పీ లింగయ్య మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన ఆలయ ఆవరణలో బతుకమ్మ సంబురాలను తిలకించారు. అయ్యప్ప అడ్వకేట్, జగదీశ్వర్, బస్వరాజ్, తిప్పయ్య, హరిప్రసాద్, వీరన్న ఉన్నారు.

బజరంగ్‌దళ్, వీహెచ్‌పీ ఆధ్వర్యంలో..

మక్తల్ : పట్టణంలోని ఛత్రపతి శివాజీ నగర్‌లో ప్రతిష్ఠించిన దుర్గామాతకు బజరంగ్‌దళ్, వీహెచ్‌పీ నాయకులు మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. ప్రఖండ సంయోజక్ రాహుల్, మూర్తి, నాగరాజు, అక్షయ్, వంశీ, అరవింద్, విశాల్, ఆనంద్ పాల్గొన్నారు.

'రేపు మటన్, చికెన్ విక్రయించొద్దు'

నారాయణపేట న్యూటౌన్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట పట్టణం, పరిసర ప్రాంతాల్లో ఈనెల 2న గాంధీ జయంతి సందర్భంగా మటన్, చికెన్‌లు విక్రయించొద్దని విక్రయదారులకు మునిసిపల్ కమిషనర్ నరసయ్య సూచించారు. నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

భగవద్గీత గ్రంథాల ప్రదానం

కొత్తపల్లి, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నిడ్జింత గ్రామంలో బతుకమ్మలను తయారుచేసిన గ్రామ ఆడపడుచులకు ఛత్రపతి శివాజీ యువజన సంఘం సభ్యులు మంగళవారం భగవద్గీత గ్రంథాలను అందజేశారు. ఈ సందర్భంగా సంఘం సభ్యులు మాట్లాడుతూ సనాతన ధర్మాన్ని కాపాడాలని, కాపాడిన వారిని ప్రోత్సహించాలని, సంస్కృతీ సంప్రదాయాలను తర్వాతి తరాలకు అందజేయాలని గ్రామస్థులను కోరారు.

ఘనంగా గ్రామ దేవతల జాతర

మక్తల్‌రూరల్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మక్తల్ మండలం సంగంబండ, గుడిగండ్ల గ్రామాల్లో మంగళవారం గ్రామ దేవతల జాతర ఘనంగా నిర్వహించారు. సంగంబండ కోట్ల మైశమ్మ గ్రామ దేవతకు భక్తులు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి నైవేద్యం సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. గుడిగండ్ల గ్రామంలో కర్రెమ్మ గ్రామ దేవతకు ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు చెల్లించుకున్నారు.

ఉన్నత స్థాయిలో రాణిస్తున్న పేట జిల్లా వాసులు

నారాయణపేట, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఉన్నత పదవుల్లో నారాయణపేట జిల్లా వాసులు రాణిస్తున్నారు. రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో మంగళవారం నారాయణపేటకు చెందిన కంట్రోలర్ శ్రీనివాస్ కూతురు గ్రూప్-1లో వచ్చిన డిప్యూటీ కలెక్టర్ ఉద్యోగంతో ట్రైనీగా రిపోర్ట్ చేసి రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందించారు. అయితే వీరిద్దరు ఉద్యోగం రీత్యా కలిసినా నారాయణపేట జిల్లాకు చెందిన వారు కావడం విశేషం. నారాయణపేట జిల్లా నర్వ మండలం మండలం సీపూర్‌కు చెందిన నారాయణరెడ్డి ప్రస్తుతం రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌గా కొనసాగుతున్నారు. తాజాగా నారాయణపేటకు చెందిన వీణ గ్రూప్-1లో రాణించి డిప్యూటీ కలెక్టర్‌గా ఉద్యోగం పొంది ట్రైనీగా రంగారెడ్డి జిల్లాలో విధుల్లోకి చేరారు. ఇదిలా ఉండగా మరొకరు నారాయణపేటకు చెందిన రిటైర్డ్ పీఈటీ నర్సిములు కుమారుడు రాహుల్ ప్రస్తుతం భద్రాచలం పరిధిలో ట్రైబల్ ఐటీడీఏ ప్రాజెక్టు అధికారిగా కొనసాగుతున్నారు. తాజాగా భద్రాచలం దగ్గర ట్రైబల్ మ్యూజియంను తీర్చిదిద్ది పర్యాటకులను ఆకర్షించే విధంగా తీర్చిదిద్దారు. దాంతో 2025 సంవత్సరానికి గాను టూరిజం ఎక్స్‌లెన్స్ అవార్డును హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతులమీదుగా రాహుల్ అందుకున్నారు. ఇలా జిల్లాకు చెందిన వారు ఉన్నత స్థాయిలో రాణిస్తుండడంతో జిల్లా వాసుల నుంచి సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.



సీఎం చేతుల మీదుగా టూరిజం ఎక్స్‌లెన్స్ అవార్డు అందుకున్న రాహుల్



రంగారెడ్డి కలెక్టరేట్‌లో కలెక్టర్ నారాయణరెడ్డికి పూల మొక్కను అందిస్తున్న ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ వీణ



పేట ఆర్టీసీ కంట్రోలర్ శ్రీనివాస్ కుటుంబీకులతో వీణ

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



మరికల్ మండలం ఎలిగండ్లలో ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్న పోలీస్, రెవెన్యూ అధికారులు

నారాయణపేట టౌన్/ఊట్కూర్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రతీనెల చివరి తేదీన పౌర హక్కుల దినోత్సవం(సివిల్ రైట్స్ డే) నిర్వహిస్తున్నట్లు పోలీసులు, రెవెన్యూ అధికారులు తెలిపారు. జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో తాము కొన్ని గ్రామాలను సందర్శించి ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా మరికల్ మండలం ఎలిగండ్లలో కుల నిర్మూలన, ఎస్సీ, ఎస్టీ కులాల వారిని చైతన్యపర్చడం తదితర చట్టాలపై ప్రజలకు పోలీసు, రెవెన్యూ అధికారులు అవగాహన కల్పించారు.

అదేవిధంగా, ఊట్కూర్ మండలంలోని బాపూర్ గ్రామంలో రెవెన్యూ, పోలీసు అధికారులు ప్రజలకు పౌర హక్కులపై అవగాహన కల్పించారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం 1989 విశిష్టత, వినియోగించే విధానం, పోక్సో చట్టం, పౌరహక్కుల రక్షణ చట్టాల గురించి ఆర్‌ఐ వెంకటేశ్ వివరించారు.

మద్దూర్ ఘటనపై నిజాలు నిగ్గు తేల్చాలి

» మతమార్పిడులపై ఉక్కుపాదం మోపాలి

» బీజేపీ రాష్ట్ర నాయకుడు నాగూరావు నామాజీ డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర నాయకుడు నాగూరావు నామాజీ

నారాయణపేట న్యూటౌన్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మద్దూర్ మండలంలో ఇస్లామిక్ ఉగ్రవాదుల అరాచకాలకు ఓ గిరిజన యువకుడు వారి బాధలు భరించలేక ఆత్మహత్య చేసుకుంటున్నానని సూసైడ్ నోట్ రాసిన ఘటనపై పోలీసులు సమగ్ర విచారణ జరిపి నిజాలను నిగ్గు తేల్చాలని బీజేపీ రాష్ట్ర సీనియర్ నాయకుడు నాగూరావు నామాజీ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మద్దూర్‌లో తాజుద్దీన్, యాసిన్‌లు అప్పులు ఇస్తామని ప్రజలకు ఎరవేస్తూ అమాయకులను వలలో వేసుకుని అప్పులు ఇవ్వకుండానే ఇచ్చినట్లు సంతకాలు చేసుకుని ఆ తరువాత డబ్బులు ఇవ్వాలని వేధిస్తున్నారని ఆరోపించారు. అంతేకాకుండా మీకు డబ్బులు ఇస్తాం.. మతం మారాలని వారిని వత్తిడికి గురి చేస్తున్నట్లు పేర్కొన్నారు. గతంలో రాంచంద్రప్ప అనే వ్యక్తి కూడా ఇలాంటి ఘటనకే గురై ఆత్మహత్య చేసుకున్నారని గుర్తు చేశారు. ఇప్పటికైనా పోలీసులు ఇస్లామిక్ ఉగ్రవాద చర్యలకు పాల్పడకుండా ఉండేలా తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు కె.సత్యయాదవ్, ప్రధాన కార్యదర్శి లక్ష్మీశ్యాంసుందర్‌గౌడ్, నాయకులు మదన్, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులున్నారు.

వైద్య శిబిరం విజయవంతం



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

నారాయణపేట న్యూటౌన్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో గొంతు, ముక్కు, చెవి, కళ్లకు సంబంధించిన వైద్యులు 130 మంది రోగులను పరీక్షించి, మందులు పంపిణీ చేశారు. వీరితో పాటు ఓపీ రోగులను కూడా పరీక్షించారు. ప్రస్తుత సీజన్‌లో ప్రబలే రోగాలు, ముందుజాగ్రత్త చర్యలను వారు వివరించారు. కార్యక్రమంలో వైద్యులు డా.బిపిన్‌కుమార్, డా.జయలక్ష్మీ, డా.నరసింహారావు సగరిలతో పాటు ఆశ వర్కర్లు, వైద్య సిబ్బంది ప్రకాష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ



నోటు పుస్తకాలు పంపిణీ చేస్తున్న డాక్టర్ గీత

నారాయణపేట టౌన్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): పేట బ్రాహ్మణవాడి చౌడేశ్వరి దేవాలయంలో డాక్టర్ గీత మార్వాడీ మహిళలతో కలిసి అమ్మవారికి పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో చిన్నారులకు రాత పుస్తకాలతో పాటు, ఆట వస్తువులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

మాదాసి కుర్వ సంఘం గ్రామ కమిటీ ఎంపిక



అమీన్‌పూర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న కుర్వ సంఘం నాయకులు

నారాయణపేటరూరల్/ఊట్కూర్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొల్లంపల్లి గ్రామ మాదాసి కుర్వ సంఘం కమిటీని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ కమిటీ అధ్యక్షుడిగా యాదయ్య, ఉపాధ్యక్షులుగా మూకప్ప, పెద్ద వెంకటప్ప, గౌరవ అధ్యక్షుడిగా చిన్న నర్సప్ప, కార్యదర్శిగా చిన్న సాయిలు, కోశాధికారిగా మల్లప్పతో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు బండి హన్మంతు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆశప్ప, కోశాధికారి జి.వెంకటప్ప, మాలె నర్సింహ తదితరులున్నారు.

అదేవిధంగా, ఊట్కూర్ మండలం నిడుగుర్తి గ్రామ మాదాసి కుర్వ సంఘం గ్రామ కమిటీని మంగళవారం గ్రామంలోని బీరప్ప దేవాలయ ఆవరణలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ప్యాట లింగప్ప, ఉపాధ్యక్షుడిగా తోక వెంకటప్ప, ప్రధాన కార్యదర్శిగా తాండూర్ మిలటరీ సంతోష్, కార్యదర్శిగా కర్రెం తిమ్మప్ప, కోశాధికారిగా ముకపోల్ల బాలింగప్ప, ప్రచార కార్యదర్శిగా వట్టెం గోవిందులను ఎన్నుకున్నారు. అమీన్‌పూర్‌లో అధ్యక్షుడిగా చిన్న అయిలప్ప, ఉపాధ్యక్షుడిగా దేవరింటి నర్సప్ప, ప్రధాన కార్యదర్శి నారపోళ్ల సిద్దప్ప, కార్యదర్శిగా బోగంటి నర్సప్ప, కోశాధికారి పెద్ద అయ్యలప్పను ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడు సింగారం హన్మంతు, మక్తల్ నియోజకవర్గ అధ్యక్షుడు అంజప్పలు నూతన కమిటీకి నియామకపత్రం అందించారు.

ద్వేషించే వారిని సైతం ప్రేమించాలి

ఊట్కూర్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మనల్ని ద్వేషించే వారిని సైతం ప్రేమించడమే మహమ్మద్ ప్రవక్త తన జీవిత ఆచరణలో మనకు ఇచ్చిన సందేశం అని ప్రొఫెసర్ అన్వర్‌ఖాన్ అన్నారు. ప్రవక్త జన్మదినం సందర్భంగా మంగళవారం మండల కేంద్రంలోని పంచ్ మసీద్ వద్ద జమాతే ఇస్లామిక్ హింద్ ఆధ్వర్యంలో మానవత్వపు మార్గదర్శకుడు మొహ్మద్ అనే అంశంపై నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రవక్త అలవాట్లు ఆచరణలో అమలు చేయడమే అతనికి మనము ఇచ్చే నిజమైన గౌరవమని అన్నారు. అనంతరం పాఠశాల విద్యార్థులు ప్రవక్త ఉపదేశాలు, జీవితంపై నాథ్‌లను ఆలపిస్తూ జాగరణ చేశారు. అంతకుముందు జడ్పీటీసీ మాజీ సభ్యులు సూర్యప్రకాష్‌రెడ్డి, అవింద్‌కుమార్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యజ్ఞేశ్వర్‌రెడ్డిలు మాట్లాడారు. మండల నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.